ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అసాంఘికాల జోరు

- ఆగని మట్కా, జూదం, బెట్టింగ్
- కట్టడిలో పోలీసులు విఫలం
- అసెంబ్లీలో సైతం ధ్వజమెత్తిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి





> వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు చెలరేగిన అసాంఘిక కార్యకలాపాలన్నీ కూటమి ప్రభుత్వంలోనూ ఆగడంలేదు. కేవలం ప్రభుత్వం, పాలకులు మారారు తప్ప అసాంఘిక శక్తులన్నీ ఎక్కడ అధికారం ఉంటే అక్కడికి వాలిపోయి తమ కార్యకలాపాలన్నీ యథావిధిగా కొనసాగిస్తూనే ఉన్నాయి. వ్యాపార వాణిజ్య కేంద్రమైన ప్రొద్దుటూరు పసిడిపురిగానే కాకుండా.. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్, జూదం, మట్కాల నిర్వహణకు కేరాఫ్ అడ్రస్‌గా కూడా అపఖ్యాతి మూటగట్టుకుంది. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాల్సిన పోలీసులు ప్రొద్దుటూరులో విఫలం అయ్యారు.

ప్రొద్దుటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఒకప్పుడు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో మట్కా యథేచ్ఛగా కొనసాగుతుండేది. కాలక్రమంలో మట్కా బీటర్ల వ్యవస్థ కనుమరుగైంది. పట్టీలు తీసుకునేవారు లేరు. కంపెనీలు నడిపే వారు మాయమయ్యారు. కానీ నేడు మట్కా సెల్‌ఫోన్ కేంద్రంగా యథేచ్ఛగా సాగుతోంది. వాట్సాప్‌లోనే మట్కా నెంబర్లను పంపిస్తున్నారు. ఫలానా నెంబరుకు ఇంత అమౌంట్ అని వాట్సాప్ చాటింగ్‌లో వెల్లడిస్తున్నారు. వీటిని స్క్రీన్ షాట్స్ తీసుకొని వేరే సెల్ ఫోన్‌లో భద్రపరిచి వాట్సాప్ చాటింగ్‌ను ఇరువురు డిలిట్ చేస్తున్నారు. దీంతో ఈ తరహా మట్కా నడిపే వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. ప్రొద్దుటూరులో నేడు మట్కా ఒన్‌టౌన్, టూటౌన్ పరిధిలో సాగుతోంది. ముఖ్యంగా టూటౌన్ పరిధిలో ఉన్న మట్కాకింగ్‌లు పోలీసు వ్యవస్థను శాసిస్తున్నారు. వీరు నెలమామూళ్లు ఇచ్చి కొత్తపెళ్లి కొడుకుల్లా స్టేషన్లకు వచ్చి వెళుతున్నారని ఆరోపణలున్నాయి. వైసీపీ హయాంలో మట్కా కింగ్‌లుగా ఉన్న వారే తిరిగి కూటమి ప్రభుత్వంలోనూ ఆ దందా కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా వారిదే స్టేషన్లలో పెత్తనం కొనసాగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

క్లబ్ కేంద్రంగా జూదం



జమ్మలమడుగు రోడ్డులో ఉన్న ఒక క్లబ్‌లో జూదం యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ జూదం ఆడేవాళ్లు అంతా సమాజంలో ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడి కలిగిన పెద్ద మనుషులు కావడంతో ఆ క్లబ్ మీద పోలీసులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. అంతేకాకుండా క్లబ్ నుంచి స్టేషన్ మామూళ్లు కూడా పోతున్నాయని ఆరోపణలున్నాయి. రోజూ లక్షల్లో ఇక్కడ రమ్మీ ఆట నడుస్తుందని కొందరు ఆరోపిస్తున్నారు.

అధికార పార్టీ వ్యక్తులు సైతం..

ప్రొద్దుటూరులో కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కొర్రపాడు రోడ్డులో గల ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదుల్లో గుట్టుచప్పుడు కాకుండా జూదం నడిపిస్తున్నట్లు సమాచారం. పదిరోజులు జరిగిన దసరా పర్వదినాల్లో పోలీసులు అందరూ బందోబస్తు డ్యూటీల్లో ఉండటంతో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్ద ఎత్తున జూదం నడిపి రూ.లక్షల్లో లావాదేవీలు సాగించినట్లు చెబుతున్నారు.

స్థావరాలు మార్చుతూ జూదం

ఎర్రగుంట్ల మండలం ఇల్లూరుకు చెందిన వైసీపీ నేత ఒకరు, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన నేతలు కొందరు, దొరసాని పల్లెకు చెందిన వైసీపీ, టీడీపీ నేతలు కొందరు.. తరుచూ స్థావరాలు మార్చుతూ జూదం నడిపిస్తున్నారు. ఇటీవల చౌటపల్లె గ్రామ పరిధిలోని రాచమల్లు కాలనీలో రాయల్ కౌంటీ వద్ద జూదం ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యంగా రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రాజుపాళెం, ప్రొద్దుటూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ ఆట సాగిస్తున్నారు. ఒన్‌టౌన్ పరిధిలో ఆర్ట్స్ కాలేజీ రోడ్డు ఏరియా, త్రీటౌన్ పరిధిలోని వైఎంఆర్ కాలనీల్లో కూడా కొందరు యువకులు జూదం, పేకాట నడిపిస్తున్నారు. ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో నక్కలదిన్నెకు చెందిన వ్యక్తి పెద్ద ఎత్తున జూదం నడిపిస్తున్నట్లు పోలీసు వర్గాలే వెల్లడిస్తున్నాయి. ప్రొద్దుటూరులో పోలీసుల నిఘా పెరిగినప్పుడు పక్కనే ఉన్న కలమల్ల, ముద్దనూరు, తొండూరు మండలాలలోని తోటల్లో పెద్ద ఎత్తున పేకాట నడిపిస్తున్నారు. ఇటీవల గండికోట సమీపంలో దొప్పెర్ల వద్ద పెద్ద ఎత్తున సాగుతున్న జూదంపై అప్పటి ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో దాడి చేసి వారిని కడపకు తీసుకెళ్లి భారీగా కోటింగ్ ఇచ్చారు. వారిలో కొందరు ప్రొద్దుటూరు వాసులు ఉన్నారు. ఈ ఆటను జమ్మలమడుగు పోలీసుల సహకారంతోనే నడిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

అసెంబ్లీలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరులో మట్కా, క్రికెట్‌బెట్టింగ్, జూదం యథేచ్ఛగా సాగుతున్నాయని పోలీసులు వాటిని అరికట్టడంలో విఫలం అయ్యారని కొత్తగా వచ్చిన పోలీసు అధికారులు కూడా అవినీతికి పాల్పడుతున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారు. వైసీపీ పాలనలోలాగానే పోలీసులు ఇప్పుడూ నడుచుకుంటున్నారని అన్ని అసాంఘిక కార్యకలాపాలు వారి కనుసన్నుల్లోనే సాగుతున్నాయని ఆరోపించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ నచికేత్ విశ్వనాధ్ అయినా ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యాకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికడుతున్నాం



ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్‌లను పూరిస్థాయిలో అరికట్టడానికి కృషిచేస్తున్నాం. మట్కా కింగ్‌లనే ఇద్దరిపై పీడీ యాక్ట్ పెడుతున్నాం. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లపై నిఘా పెట్టాం. నిర్వాహకులు ఇక్కడి వారైనా నిర్వహణ అంతా బయట దేశాలు, రాష్ట్రాల నుంచి జరుగుతోంది. ఇందులో బడా బుకీలపై కన్నేసి ఉంచాం. ఆర్గనైజింగ్ జూదం సాగడం లేదు. ఎవ్వరైనా ఆర్గనైజింగ్ జూదం నిర్వహిస్తుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసు స్టేషన్లలో అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటాం. దొంగతనాలను అరికట్టేందుకు త్వరలో పట్టణంలో కొత్తగా సీసీ కెమరాలు పెడతాం. ప్రొద్దుటూరులో నేరాలను కట్టడి చేయటంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేస్తున్నాం.

- పి. భావన, డీఎస్పీ, ప్రొద్దుటూరు

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.82.90 లక్షలు

- ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి వెల్లడి



కడప మారుతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ఆదాయం రూ.82.90 లక్షలు వచ్చినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం పి.గోపాల్‌రెడ్డి వెల్లడించారు. గురువారం స్థానిక ఆర్‌ఎం కార్యాలయంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న జిల్లా ప్రజలను రప్పించేందుకు అనువుగా అలాగే పండుగ తరువాత తిరిగి వారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కడప రీజియన్ పరిధిలోని (కడప నుంచి 68 బస్సులు, పులివెందుల 26, బద్వేలు 84, జమ్మలమడుగు 73, మైదుకూరు 25, ప్రొద్దుటూరు 52) ఆరు డిపోల నుంచి 328 బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. ఆ మేరకు దాదాపు లక్షా 80 వేల కి.మీ. బస్సులు తిరిగాయని, కి.మీ.కు రూ.46 చొప్పున ఆదాయం చేకూరిందన్నారు. ఇదిలా ఉండగా ప్రతి బస్సుకు 79 శాతం సీట్లు భర్తీ అయినట్లు స్పష్టం చేశారు. ఇందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ ఉద్యోగులకు (కండక్టర్లు డ్రైవర్లు, మెకానిక్స్ తదితరుల)కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే తరహాలో ముందు కూడా ప్రయాణికుల సేవలో ఆర్టీసీ ఉద్యోగులు సేవలందించాలని సూచించారు.

మద్దతు ధరతో ధాన్యం సేకరణ : కలెక్టర్

కడప, కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ నెల 15 నుంచి మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపై జేసీ అదితిసింగ్, వ్యవసాయశాఖ అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే, జూన్ మాసాలలో నాట్లు వేసిన వరి పంటలు కోత దశకు చేరిన నేపథ్యంలో రైతులు, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న దాదాపు 9ఆర్‌ఎస్‌కే కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. కనీస మద్ధతు ధర క్వింటాకు గ్రేడ్ ఏ రకానికి రూ.2389లుగా, సాధారణ రకానికి రూ.2369లుగా మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే రైతులు వరిధాన్యంలో తగినంత తేమశాతం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం వేంపల్లి-1, కమలాపురం-1 సిద్దవటం-1, చెన్నూరు-2, ఖాజీపేట-1, నందిమండలం-1 పెన్నాపేరూరు-1లలో 9 ఆర్‌ఎస్కేలలో వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రైతుల అవసరాలను బట్టి మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, సివిల్ సప్లయ్ డీఎం నాగసుధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ సర్టిఫికెట్ ఉంటేనే అనుమతి

- ఆర్డీవో జాన్‌ఇర్విన్

కడప కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సర్టిఫికెట్ ఉంటేనే టపాసుల దుకాణాలకు అనుమతి ఇస్తామని ఆర్డీవో జాన్‌ఇర్విన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబరు 20న దీపావళి పండుగకు సంబంధించి కొత్తగా దరఖాస్తు చేసుకొనే వారు, రెన్యువల్‌కు దరఖాస్తులు సమర్పించిన వారు తప్పక వాణిజ్య పన్నుల విభాగం (జీఎస్టీ) ధ్రువీకరణ అనుమతులు తీసుకోవాలని సూచించారు. అటువంటి వారికే దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు.

లక్ష్యానికి పనులు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ, తదితరులు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించి న లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబం ధిత శాఖల అధికారులను ఆదేశిం చారు. గురువారం రాష్ట్ర సచివాల యం నుంచి జీఎస్‌డబ్ల్యుఎస్ సేవలు, వైద్య ఆరోగ్య సదుపాయాలు, పౌరసరఫరాలు, రైతు సేవా కేంద్రాల్లో సేవలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిహారం, ఎస్సీ కార్పొరేషన్ వాహనాల కొనుగోలు, పంపిణీ పెన్షన్ల పునఃమూల్యాంకనం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు రూమ్ నుంచి కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్‌లు హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, డ్రగ్స్ పంపిణీ, ఆసుపత్రుల్లో పారిశుధ్యం, రోగ నిర్ధారణ సేవలపై దృష్టి సారించాలన్నారు. కొత్త స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ, రైతు సేవాకేంద్రాల తనిఖీ, రైస్‌మిల్లులకు ట్యాగింగ్, తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో హజరత్తయ్య, సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లంచం అడిగిన డాక్టర్‌కు ఉద్వాసన

- మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి): మానసిక వైకల్యంతో బాధపడు తున్న బాలికకు సదరం సర్టిఫికెట్ జారీ చేసేందుకు లంచం అడిగిన ప్రభుత్వ వైద్యుడిపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2022 ఏప్రిల్‌లో వైఎస్సార్ కడప జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పిల్లల మానసిక వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న ఓ డాక్టర్ బాలిక తండ్రి నుంచి రూ.10 వేలు లంచం డిమాండ్ చేసినట్లు తేలింది. తండ్రి రూ.5వేల వరకే ఇవ్వగలనని చెప్పినా వైద్యుడు పట్టుబట్టడంతో చివరికి రూ.7వేలు ఇవ్వడానికి తండ్రి ఒప్పుకొన్నారు. అయినా రూ.10 వేలే ఇవ్వాలని, అది కూడా రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆ వైద్యుడు గడువు పెట్టడంతో బాధితుడు చివరకు కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ని విచారణకు ఆదేశించారు. ఏసీబీ సాక్షుల వాంగ్మూలాలు, పత్రాల ఆధారంగా ఆరోపణలు వాస్తవమని నిర్ధారించి ఏప్రిల్ 2025లో తమ నివేదికలో స్పష్టం చేసింది. సంబంధిత వైద్యుడు కాంట్రాక్టు విధుల్లో ఉండడంతో అతనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. మానవత్వం మరచిపోయి బాలిక తల్లిదండ్రులకు బాధను కలిగించిన ఆ వైద్యుడి ప్రవర్తనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వైద్యుడికి తక్షణ ఉద్వాసన ఇవ్వాలని ఆదేశిస్తూ కడప కలెక్టర్‌కు విచారణ నివేదికను పంపించారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ ఆ వైద్యుడిని సేవల నుంచి తొలగించేందుకు ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

బావ అండతో చెలరేగిన బావమరిది..

- అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ
- సీజ్ చేసి విచారణ చేపట్టిన గనులశాఖ అధికారులు
- 5 ఎకరాలకు దరఖాస్తు.. 10 ఎకరాలకుపైగా ఆక్రమణ
- మంత్రి గిరిధర్‌రెడ్డి దందా

6



జీఎస్టీపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

కడప కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ఐఎంఏ హాలు నుంచి ఏడురోడ్ల కూడలి వరకు నిర్వహించారు. అనంతరం ఐఎంఏ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ జీఎస్టీ-2.0 సంస్కరణలు పేదలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సమాచారాన్ని ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనరు ఆఫ్ సేల్స్‌టాక్స్ ఆఫీసరు పద్మావతి, జాయింట్ కమిషనరు డాక్టర్ జమున, ఐఎంఏ అధ్యక్షుడు అవ్వారు, డెమో భారతి, మలేరియా అధికారి మనోరమ, పలువురు వైద్యులు, ఆసుపత్రుల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పీఆర్ డీఈఈలకు ఇంక్రిమెంట్ల కోత

- ఒక ఏఈకి విముక్తి

6

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలు రూపొందించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా ట్రబుల్ మాంగర్స్‌పై, ఎన్నికల నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో నేరాల నిరోధానికి అన్ని సబ్ డివిజన్లలో క్రైం పార్టీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత గడువులోగా చట్టపరిధిలో పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, ఆలయాలు, మసీదులు, చర్చిలలో ఏపీ పబ్లిక్ సేఫ్టీ మెజర్స్ యాక్ట్ మేరకు సీసీ టీవీ కెమెరాలు అమర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా దుకాణాలు, గోడౌన్లలో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినా, విక్రయించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో మర్డరు కేసును త్వరితగతిన ఛేదించిన డీఎస్పీ పి.భావన, ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (ఏఆర్) బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు, ప్రత్యేక విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కత్తులతో ఇరువర్గాల దాడి

- నలుగురికి గాయాలు
- 19 మందిపై కేసు నమోదు





దాడిలో గాయపడిన నాగయ్య, టి.గంగాధర్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.తుమ్మలపల్లె గ్రామంలో డబ్బు విషయమై ఇరువర్గాలు గురువారం రాళ్లతో, ఇనుపరాడ్లతో, కత్తులతో పరస్పర దాడులకు దిగారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... కప్పల నాగయ్య అనే వ్యక్తి మంచాల రామాంజనేయరెడ్డి వద్ద రెండు ఎకరాల పొలాన్ని తనఖా పెట్టి రూ.90లక్షలు అప్పుగా తీసుకున్నారు. ప్రతి ఏడాది రూ.90 లక్షలకు వడ్డీ చెల్లించాలని మూడేళ్ల నాటికి రూ.90లక్షలు అసలు చెల్లించి భూమిని విడిపించుకునేలా అగ్రిమెంట్ రాసుకొన్నారు. వడ్డీకి సంబంధించి రూ.5లక్షలు చెల్లించలేదు. దీంతో రామాంజనేయరెడ్డి.. రూ.5లక్షలు వడ్డీ చెల్లించలేదు.. అలాగే మూడేళ్ల గడువు కూడా పూర్తికావస్తోంది.. ఎప్పుడు డబ్బులు ఇస్తావని నాగయ్యను బుధవారం గట్టిగా ప్రశ్నించాడు. కొంత సమయం కావాలని నాగయ్య బదులివ్వడంతో అనుకున్న ప్రకారం మూడేళ్లలో డబ్బు పూర్తిగా చెల్లించకపోతే భూమి వదులుకోవాల్సి వస్తోందని రామాంజనేయరెడ్డి తెలిపాడు. కాగా గురువారం ఉదయం రామాంజనేయరెడ్డి మరికొంతమందితో కలిసి తోట వద్దనున్న నాగయ్యను డబ్బు విషయం గట్టిగా నిలదీశారు. దీంతో మాటామాటా పెరిగి ఇరువర్గాలు పరస్పరం, రాళ్ల, ఇనుపరాడ్లు, కత్తులతో దాడికి దిగారు. ఈ దాడిలో నాగయ్య, అతని కుమారుడు అనిల్‌కుమార్, అలాగే తుమ్మల గంగాధర్‌రెడ్డి, బండి మల్లారెడ్డిలకు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. కాగా నాగయ్య పరిస్థితి విషమించడంతో కడపకు తరలించారు. దీనిపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 19 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నిమ్మనపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికను మాయమాటలతో బలాత్కారం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ ఓ గ్రామానికి చెందిన బాలిక (17) మదనపల్లిలోని ఓ కళాశాలలో చదువుతోంది. రోజు బస్సులో మదనపల్లికి వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొరివి శంకర కుమారుడు కళ్యాణ్ ఆ యువతిని ప్రేమ పేరుతో ఆమె వెంట తిరుగతూ వేధించేవాడని తెలిపారు. పది రోజుల కిందట బలవంతంగా ద్విచక్రవాహనంపై తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపార న్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆ యువతిని గట్టిగా ప్రశ్నించగా తనను కళ్యాణ్ బెదిరించి నెల రోజుల కిందట బోయకొండ అటవీ ప్రాతంలోకి తీసుకెళ్లి బలవంతం చేశాడని తెలిపింది. దీంతో స్థానిక పోలీసులకు బాధిత తండ్రి ఫిర్యాదు చేయడంతో కళ్యాణ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ


గల్లా నాగరత్నమ్మ

గుర్రంకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని తాగడానికి మంచి నీళ్లు అడిగి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లిన సంఘటన బుధవారం సాయంత్రం నడిమి ఖండ్రిగలో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. మండలం లోని నడిమిఖండ్రిగ వాసి గల్లా నాగరత్నమ్మ అదే గ్రామంలో ఉన్న కుమార్తె వద్ద ఉంటూ జీవిస్తోంది. గ్రామంలోని శ్రీనివాస్ డాబా పక్క నున్న మామిడి తోటలోని ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని యువకులు వచ్చి తాగడానికి మంచి నీళ్లు అడిగారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలు ఇంట్లోకి నీళ్లకోసం వెళుతుండగా వెనుక నుంచి మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసును లాకెళ్లాడు. ఈ క్రమంలో వృద్ధురాలు కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు వృద్ధురాలికి సపర్యలు చేయడంతో తేరుకుంది. దీంతో జరిగిన విష యాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు చెప్పడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

దేవుని మాన్యాలకు రక్షణ కల్పిస్తాం

● జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్


ప్రహరీగోడను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ విశ్వనాథ్

సుండుపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని మాన్యాలకు రక్షణ కల్పిస్తామని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సుండుపల్లెమ్మ మాన్యాన్ని ఆయన పరిశీలించారు. 2127 సర్వే నెంబర్‌లో 4.40 ఎకరాల భూమి ఉందని, ఇది సుండుపల్లెమ్మ మాన్యంగా రికార్డుల్లో ఉందన్నారు. అయితే కొంతమంది ఎన్‌వోసీ కోసం వినతిపత్రం అందించారని, కానీ ఎన్‌వోసీ ఇవ్వలేదన్నారు. ఈ స్థలం 9 మంది ఆధీనంలో ఉందని తెలిసిందన్నారు. సుండుపల్లెమ్మ దేవస్థానం దేవదాయశాఖలో పబ్లికేషన్ కాలేదని, 2127 సర్వే నెంబర్‌లో కొంతమంది రిజిస్ట్రేషన్, ఇంకొందరికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని, వీరికి నోటీసులు జారీ చేస్తామన్నారు. పై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే శివాలయాన్ని సందర్శించినప్పుడు ఆలయం ప్రహరీగోడ వర్షాలకు పడిపోయిందని, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని, అలాగే రెండు ధ్వజస్తంభాలు తుప్పు పట్టాయని, నూతనంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని గ్రామస్థులు కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో మలేరియా నివారణపై పోస్టల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షపునీరు నిలబడే చోట లార్వా చేసుకొని దోమలు ఎక్కువై మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామాల్లో పోస్టర్లు వేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పల్లెలోనూ ఆరోగ్య కార్యకర్త లార్వా సర్వే నిర్వహించి కొబ్బరి చిప్పల్లో, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతిరోజు గ్రామలను సందర్శించి జ్వరాలు వచ్చిన వారికి చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై కొనసాగుతున్న దాడులు

● నిందితుడు అరెస్టు ● 51 మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగుతున్నాయి. ములకలచెరువు కేంద్రంగా జరుగుతున్న నకిలీ మద్యం గుట్టరట్టు కావడంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగిస్తున్నారు. తాజాగా గురువారం స్థానిక పోలీసులు మండలంలోని కాలువపల్లె పంచాయతీ బుద్ధలవారిపల్లెలో దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేశారు. అతని నుంచి 51 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సీఎంతో ముక్కా

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోడూరు-వెంకటగిరి, సోమశిల బ్యాక్‌వాటర్, నియోజకవర్గంలో చేయాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లతో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రైల్వేకోడూరు ప్రచారంలో కోడూరు-వెంకటగిరి రోడ్డు, పెనగలూరు వద్ద సోమశిల బ్యాక్‌వాటర్ ఎత్తిపోతల పథకంపై ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయాలని కోరామన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి రావాల్సిన అభివృద్ధి కార్యక్రమాల నివేదికను అందించామన్నారు. అలాగే కోడూరు ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు డయాలసిస్ కోసం రోగులు వెళుతున్నారని, రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించామని తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని ముక్కా తెలిపారు.


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చిస్తున్న ముక్కా

బావ అండతో..
చెలరేగిన బావమరిది..


క్వారీలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

- అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ
- సీజ్ చేసి విచారణ చేపట్టిన గనులశాఖ అధికారులు
- 5 ఎకరాలకు దరఖాస్తు.. 10 ఎకరాలకు పైగా ఆక్రమణ
- మంత్రి గిరిధర్‌రెడ్డి దందా

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కేసులో పాత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బావ, బావమరుదులు చేసిన నిర్వాకం మరొకటి బయట


తవ్వకాలపై సర్వే చేస్తున్న మైన్స్ సర్వేయర్లు

పడింది. టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇన్నాళ్లు ఉన్న జయచంద్రారెడ్డి అధికారం అండతో ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డి వివిధ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండానే దర్జాగా క్వారీ మొదలు పెట్టేసి రూ.లక్షల విలువ చేసే కంకరను అమ్ముకున్నారు. ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం కేసులో జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి కార్యకలాపాలపై ప్రభుత్వం తీవ్ర స్థాయిలో దృష్టి సారించింది. ఈ క్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇన్ని రోజులు జరిగిన అనేక అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట పంచాయతీ పరిధిలో వీళ్లు నిర్వహిస్తున్న క్రషర్‌ను గురువారం గనుల శాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించి సీజ్ చేశారు.

అనుమతులు లేకుండానే..

సాధారణంగా క్వారీ ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, గనుల శాఖల అనుమతులు కావాలి. అదో పెద్ద తతంగం. అయితే గిరిధర్‌రెడ్డి నడుపుతున్న తుమ్మనంగుట్ట క్వారీ విషయంలో ఇవేవి పూర్తి స్థాయిలో జరగనట్లు మైన్స్ అధికారులు గుర్తించారు. గిరిధర్‌రెడ్డి తుమ్మనంగుట్ట శివారులో సర్వే నెంబరు-111లో ఉన్న 82 ఎకరాలపైకి ఐదు ఎకరాలు లీజుకు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దీనికి పూర్తి స్థాయిలో వివిధ శాఖల నుంచి అనుమతులు రాకుండానే మరో ఐదు ఎకరాలు పెంచాలంటూ అధికారులను కోరితే అందుకు అధికారులు సమ్మతించలేదు. దీనిపై జయచంద్రారెడ్డి గనులశాఖ మంత్రి టి.జి భరత్‌కు లెటర్ రాసి అలినేషన్ కింద భూమి కేటాయించాలని కోరారు. ఆ పని ఏదో చేసి పెట్టాలని టీజీ భరత్ ఏపీఐఐసీకి లెటర్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఏపీఐఐసీ నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు, అక్కడి నుంచి బి.కొత్తకోట తహసీల్దార్‌కు రిట్కో కంపెనీ దరఖాస్తు పరిశీలించాలని ఆదేశాలు అందాయి. దీనిపై ఆగమేఘాల మీద అనుకూలంగా నివేదిక ఇవ్వాలని అప్పటి వీఆర్వోపై ఒత్తిడి తెచ్చారు. ఆయన అందుకు అంగీకరించకపోవడంతో ఆయనను కలెక్టర్‌కు సరెండర్ చేశారు. అంతా తమ చేతిలో ఉందిలే ఎవరు వస్తారు.? ఏమవుతుంది..అన్న ధీమానో ఏమో అనుమతులు రాకుండానే మిషనరీ తెచ్చేసి క్రషింగ్ మొదలు పెట్టేశారు. అనుమతుల విషయం పట్టించుకోకుండా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అయితే పరిస్థితి ఒకసారిగా తారుమారు కావడంతో గురువారం మైన్స్ ఏడీ రంగకుమార్, తహసీల్దార్ బావాజాన్‌లు తమ సిబ్బంది, పోలీసుల సాయంతో తుమ్మనంగుట్ట వద్దకు వెళ్లి క్వారీని సీజ్ చేశారు. మైన్స్ ఆర్ఐ విజయకుమారి, సర్వేయర్ మాధవీలత, ములకలచెరువు రఫీ, ముబారక్ తదితరులు క్వారీలో కొలతలు వేసి విచారణ చేపట్టారు. క్వారీలో ఎన్ని క్యూబిక్ మీటర్లు తవ్వారు? ఎన్ని వేల యూనిట్ల కంకర తీసి ఉంటారు? ప్రస్తుతం ఉన్న స్టాకు ఎంత? అనే వివరాలను నమోదు చేశారు. ఇది ముమ్మాటికీ అక్రమ క్వారీయేనని తేల్చారు. మైన్స్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పర్యావరణ శాఖ అనుమతులు లేకుండానే విద్యుత్ శాఖాధికారులు ఎలా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారో అర్థం కావడం లేదని పరిశీలనకు వెళ్లిన అధికారులు విస్తుపోయారు. ప్రస్తుతం ఈ క్వారీలో 6415 క్యూబిక్ మీటర్ల కంకర నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీనిలో డస్ట్ నుంచి 20 ఎంఎం వరకు వివిధ రకాలుగా ఉన్న సరుకును సీజ్ చేశారు. రాష్ట్ర గనుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగినట్లు సమాచారం.

ఇద్దరు పీఆర్ డీఈఈలకు ఇంక్రిమెంట్ల కోత

● ఒక ఏఈఈకి విముక్తి

కలికిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దముడియం మండలం సుద్దపల్లె ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ నిఘలతో చేపట్టిన సమగ్ర అభివృద్ధి పథకాల అమల్లో తీవ్రమైన అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లకు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2017లో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల్లో జరిగిన అక్రమాలతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లినట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఇద్దరు డీఈఈలు, ఒక ఏఈపై అభియోగాలు నమోదు చేసి 2017 జూలై 25న ప్రభుత్వానికి తదుపరి చర్యల కోసం నివేదించారు. దీని పైన పలు దఫాలు జరిగిన విచారణలు, సంజాయిషీల అనంతరం ఎనిమిదేళ్ల తరువాత తుది చర్యల ఉత్తర్వులు జారీ అయ్యాయి. అప్పట్లో జమ్మలమడుగు డీఈఈగా పనిచేసి ప్రస్తుతం కడప సబ్ డివిజన్ కమలాపురం క్వాలి టీ కంట్రోల్ డీఈఈగా పనిచేస్తున్న పి.వెంకట్రావు, ప్రస్తుతం ప్రొద్దుటూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేస్తూ అప్పట్లో జమ్మలమడుగు క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈగా వున్న టి.గోపాల్ దాస్‌పై ఆరోపణలు రుజవు కావడంతో ఇద్దరికి ఒక వార్షిక ఇంక్రిమెంట్ (క్యుములేటివ్ ప్రభావంతో) వంతున కోత విధించారు. ఇందులో వీరితో పాటు ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి జమ్మలమడుగు క్వాలిటీ కంట్రోల్ విభాగం ఏఈ ఎం.డి.సుబ్బారెడ్డి (ప్రస్తుతం రిటైర్డు)పై మాత్రం తదుపరి చర్యలను ఉపసంహరించారు. ఇద్దరు డీఈఈలు తీవ్రమైన అక్రమాలకు పాల్పడి పనుల్లో నాణ్యత లేకుండా, కొలతల్లో భారీ తేడాలతో అన్ని సాంకేతిక నియమాలను విస్మరించి న కారణంగా అప్పట్లోనే ప్రభుత్వ ఖజానాకు రూ.11,40,983లు నష్టం వాటిల్లినట్లు విచారణలో రుజువైంది. దీంతో చివరగా ఇద్దరు డీఈఈలకు ఒక్కో వార్షిక ఇంక్రిమెంటు వంతున కోత విధిస్తూ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుతో ఎస్పీ భేటీ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావును గురువారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కలిశారు. మదనపల్లెలోని వెన్నెల గార్డెన్‌లో ప్రజారవాణా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై వారు చర్చించారు. జిల్లాలో బస్సుల ప్రయాణీకుల భద్రతను మరింత పెంచాలని, బస్సు స్టేషన్‌ల్లో భద్రత చర్యలు పటిష్టం చేయాలని చర్చించుకున్నారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు నిరంతరం సురక్షితమైన, నమ్మకమైన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడంలో ఎస్పీ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా ప్రయాణికుల రక్షణకు పోలీస్‌శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని అందిస్తామన్నారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను గురువారం ఎస్పీ ధీరజ్ తనిఖీ చేశారు. ఎస్పీగా నియమితులైన మొదటసారి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు విచ్చేసి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలుకా సీఐ మహమ్మద్ రఫీ, ఎస్పీలు అన్సర్‌బాషా, శివకుమార్, పోలీసులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఎండీతో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్

వైసీపీ కుట్రలతో రాష్ట్రంలో అలజడులు

● టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ కుట్రలతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని ఆయన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ పెద్దల నుంచి వచ్చిన డైరెక్షన్‌తోనే చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపల్లె వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పు పెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలో వైసీపీ సర్పంచ్ గోవిందయ్యతో పాటు పలువురు పాల్గొన్న విషయం సాక్ష్యాధారాలతో సహా బట్టబయలైందన్నారు. దళిత సంఘాలు, ప్రజా సంఘాలు వైసీపీ చేస్తున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబేడ్కర్ భావజాలం భావితరాలకు మార్గనిర్దేశంగా చేయాలన్న ఉద్దేశంతో ఆయన విగ్రహాలను ఊరూరా నెలకొల్పుతున్నారని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి రాజకీయ లబ్ధి పొందాలని అనుకోవడం దళితులను అవమానపరచడమేనన్నారు. సీసీ కెమెరాలు, ఫోన్ లోకేషన్, కాల్ లిస్టుల ఆధారంగా స్పష్టంగా వైసీపీ నేతల బాగోతం బట్టబయలైందన్నారు. కూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లె ప్యాలెస్‌లో ఉన్నారని విమర్శించారు. రాజ్యాంగమన్నా, ప్రజాస్వామ్యమన్నా లెక్కచేయని క్రూర స్వభావి జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఉండటానికి అర్హుడు కాదన్నారు. జగన్ ఇంకెంత కాలం దళితుల పేరు చెప్పి కుట్ర రాజకీయాలు చేస్తావని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని విధ్వంసాలు చేయాలని ప్రయత్నించినా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. వైసీపీ హయాంలో 56వేల మంది దళితులపై దాడులు, 192 మందిని హత్య చేశారని స్వయంగా రాజ్యసభలో కేంద్రం వెల్లడించిందని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

విద్యార్థుల గైర్హాజరును నమోదు చేయాలి

● స్కూల్ కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య

రైల్వేకోడూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరును రిజిష్టర్‌లో నమోదు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఆల్టర్నేట్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఉవల వెంకట్రామయ్య తెలిపారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని, పాఠశాలల్లో దీర్ఘ గైర్హాజరు విద్యార్థుల పునఃప్రవేశం, డ్రాపౌట్ విద్యార్థులు లేకుండా చూడడం ప్రధానోపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. ఒక విద్యార్థి మూడు రోజుల పాటు వరుసగా గైర్హాజరైతే వెంటనే తల్లిదండ్రులతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థి తిరిగి పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, సీఆర్‌పీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అనంతరాజుపేట హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకట్రామయ్య

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ


పుల్లంపేట ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మెమోరాండంతో ఉపాధ్యాయులు

పుల్లంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ప్యాప్టో నాయకులు సీవీ రమణమూర్తి, సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మార్సీలో మెమోరాండం సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులతో ఎటువంటి బోధనేతర పనులు చేయించమని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యాశక్తి, జీఎస్టీ 2.0, గూగుల్ సీట్లు నింపడం తదితర పనులు చెప్పడం తగదన్నారు. బోధనేతర పనుల వల్ల విద్యార్థులకు బోధన ఆటంకం కలగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్యాప్టో నాయకులు సిద్దయ్య, ఎస్వీ రమణ, శివరాంప్రసాద్, మునగపాటి శ్రీను, మాదవమూర్తి, ఎస్ఎండీ గౌస్, నాగభూషణం, పెంచలయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసులోని ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు


తాళాలు పగులగొడుతున్న దృశ్యం

మదనపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బారెడ్డి లేఅవుట్‌లో ఓ ఇంటి విషయమై ఇరువర్గాల మధ్య 2011 నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. ఇదే ఇంటిని స్వాధీన పరచాలంటూ 2024లో పట్టణానికి చెందిన జరీన్, చలపతి, దేవప్రకాష్, రవికుమార్, గంగరాజుపై మరో కేసు వేశారు. 17ఏళ్లుగా దేవప్రకాష్, రవికుమార్ స్వాధీనంలో ఇల్లు ఉంది. ఇంట్లో ఎనిదేళ్లగా అద్దెకు ఉంటున్న గంగరాజు ఈనెల 2న ఇల్లు ఖాళీ చేసి తాళాలు యజమాని దేవప్రకాష్‌కు అప్పగించాడు. ఇల్లు ఖాళీ అయిన విషయం తెలుసుకు న్న ఓ వర్గం తన అనుచరులతో వెళ్లి ఇంటిని తమకు అప్పగించాలని, లేకుంటే కూల్చేస్తామని దేవప్రకాష్‌ను బెదిరించాడు. బుధవారం రాత్రి మరోసారి వివాదాస్పద ఇంటికెళ్లి దౌర్జన్యంగా ఇంటికి వేసిన తాళం పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. బాధితుడు దేవప్రకాష్ పోలీసులను ఆశ్రయిస్తే ఇరువర్గాలను గురువారం స్టేషన్‌కు పిలిపించి రికార్డులు, కోర్టు పత్రాలను పరిశీలించి బాధితుడిని ఇంట్లోకి వెళ్లవద్దంటూ పోలీసులు ఆదేశించారు. ఇంటిని సంబంధం లేని వ్యక్తులు కబ్జాకు ప్రయత్నించారని పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోగా, తమ అనుభవంలోని ఇంట్లోకి తమను ప్రవేశించవద్దని సూచించడం ఏంటని బాధితులు వాపోయారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి

రాయచోటిటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని జాతీయ పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి కోరారు. గురువారం పట్టణంలోని డైట్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు మనిషి ఆయుష్షు క్షీణిస్తోందన్నారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు శివభాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు బీఎస్ పద్మావతి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చిన్నమండెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ క్లాప్ మిత్రలకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. గురువారం మండల కేంద్రంలోని దేవపట్ల రోడ్డులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద క్లాప్ మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 680 ప్రకారం కనీసం రూ.10 వేల వేతనం చెల్లించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు చెల్లించాలని, రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డెయ్య, నరసింహులు, రెడ్డెప్ప, వెంకటరమణ, నరసింహ, శాంతికుమారి, అంజనమ్మ, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల ఎంపిక బాధ్యత వీవోలదే

● ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి



యానిమేటర్ల అసోసియేషన్ ప్రతినిధులకు ఉత్తర్వులు అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు, సెర్ప్‌కు వారధిగా విధులు నిర్వహిస్తున్న గ్రామ సమాఖ్య సహాయకుల ఎంపిక బాధ్యత గ్రామ సమాఖ్యలదే. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి గురువారం ఒక మెమో విడుదల చేశారు. గ్రామ సమాఖ్య సహాయకుల పదవీ కాలాన్ని మూడేళ్ల పాటు ఉండేలా గత ప్రభుత్వం హయాం (2019 డిసెంబరు 1) నుంచి అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన తరువాత గ్రామ సమాఖ్య సహాయకుల మూడు సంవత్సరాల పదవీకాలం నిబంధనలను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకున్నారు. అదే విధంగా గ్రామ సమాఖ్య సహాయకులను ఎంపిక చేయడం, తొలగించడం గ్రామ సమాఖ్యల బాధ్యతలను ఆమె మెమోలో పేర్కొన్నారు. గ్రామ సమాఖ్య తీర్మానాన్ని సంబంధిత ఏపీయం డీఆర్‌డీఏ పీడీకి తెలియపరచాల్సి ఉంటుంది. ఏదైనా ఆర్థిక నేరాలకు పాల్పడితే అలాంటి వీఏవోలపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకునే అర్హత డీఆర్‌డీఏ పీడీకి ఉంటుందని వివరించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆమె తెలిపారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



దౌలతాపురంలో భూముల రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న రీసర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా సర్వే శాఖ అసిస్టెంటు డైరెక్టరు మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని దౌలతాపురం రెవెన్యూ గ్రామంలో చేపట్టనున్న రీసర్వేను ఏడీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి రైతులతో మాట్లాడారు. సర్వే నెంబర్లు 44, 45, 46లలో సర్వే ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల మధ్య రాబోవు కాలంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్త కుండా ఉండేందుకే రీసర్వే చేపడుతోందన్నారు. బ్రిటీషు కాలంలో చేపట్టిన సర్వే తప్ప రాష్ట్రస్థాయిలో ఇంత వరకు భూసర్వే ఇంత వరకు జరగలేదన్నారు. సర్వే అధికారులకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించి తమ భూము లకు సంబంధించి కొలతలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు ఖాజాహుసేన్, సర్వే డీటీ అర్చన, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలుపాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పునకు స్థల పరిశీలన



వేంపల్లెలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి బస్టాండ్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికార బృందం

వేంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప బైపాస్‌రోడ్డులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేసేందుకు అధికారుల కమిటీ పరిశీలన జరిపింది. గండి రోడ్డులో ఉన్న ప్రైవేటు భవనాలను, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. వేంపల్లెలో ఉన్న కార్యాలయాన్ని మార్చాలని స్థానిక టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌ను కోరారు. వారి అభ్యర్థన మేరకు గండిరోడ్డులో ఉన్న భవనాలను జిల్లా రిజిస్ట్రార్ వీవీఎన్ బాబు, ఫైర్ ఆఫీసర్ శివరామిరెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ నాగేంద్ర, ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్ తదితర అధికారుల బృందం పరిశీలించారు. గండిరోడ్డులో ఉన్న ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. అలాగే బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ద్వారా కలెక్టర్‌ను కోరారు. బస్టాండ్ సమీపంలో ఉన్న స్థలంలో కార్యాలయాన్ని ఉచితంగా నిర్మించి ఇస్తామని బీజేపీ నాయకులు గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి మేరకు బస్టాండ్ వద్దనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ వివరాల నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

13 నుంచి క్రీడా టాలెంట్ హంట్

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈ నెల 13 నుంచి 16 వరకు అండర్ 12, 14, 16, 19 పురుష క్రీడాకారులకు టాలెంట్‌హంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సభ్యుడు కె.రవి శంకర్ ఎంపికలకు హాజరై క్రీడాకారుల నైపుణ్యాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి తదుపరి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆ మేరకు ఈనెల 13న అండర్ 12, 14న అండర్ 14, 15న అండర్ 16, 16న అండర్ 19 క్రీడాకారులు తప్పక హాజరుకావాలన్నారు. క్రీడాకారులు తమ కిట్ బ్యాగులతో పాటు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, ప్రెజెంట్ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు.

'వైద్య విద్య ప్రైవేట్‌పరం ఎన్టీఆర్ ఆశయాలకు విరుద్ధం'

వేంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయడం స్వర్గీయ ఎన్టీరామారావు ఆశయాలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలో మెడికల్ కళాశాలకు రూ.400 కోట్లు ఖర్చు చేశారన్నారు. మరో వంద కోట్లు ఖర్చు చేసి ఉంటే నిర్మాణాలు పూర్తయ్యేవన్నారు. అయితే నర్సింగ్ కళాశాల భవనాలలో వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించవచ్చు, ఆసుపత్రికి సంబంధించి వందశాతం పూర్తయిందన్న ఉద్దేశ్యంతో ఎన్‌ఎమ్‌సీ పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం ద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.

15లోగా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

● విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్స్‌ను పరిష్కరించకపోతే అక్టోబరు 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళతామని స్ట్రగుల్‌కమిటీ ప్రధాన కార్యదర్శి వి.సుబ్బి రెడ్డి విద్యుత్ యాజమాన్యాలను హెచ్చరించారు. విద్యుత్ కార్యాలయాలు జనరేటింగ్ స్టేషన్లలో అక్టోబరు 14న వర్క్‌టు రూల్ పాటిస్తామన్నారు. ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం కార్మికుల, ఉద్యోగులతో ఉద్యమ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ సంస్థల్లో సుమారు 27వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నా రన్నారు. దశాబ్దాలుగా చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. తెలంగాణలో 16వేల మంది విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేశారన్నారు. అయితే ఏపీలో పర్మనెంట్ పక్కనబెడితే జీతాలు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నట్లుగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పీఆర్సీ బకాయిలు నేటికి చెల్లించడం లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 4డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యుత్ రంగంలోని కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందని, అవి పరిష్కారం కావాలంటే ఉద్యమాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు వి.గంగయ్య, డి.పుల్లారెడ్డి, రాజు, శివప్రసాద్, వెంకటరమణ తదితరులు ప్రసంగించారు.

ఆర్టీపీపీ యాష్ సమస్యను పరిష్కరిస్తాం...సీఈ



ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు

ఎర్రగుంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ సమస్యకు పరిష్కారం చూపుతామని చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్లాంట్‌లో యాష్‌ను నియంత్రించే ఈఎస్‌పీ తదితర యాంత్రాల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా దుమ్మురాకుండా చేస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో వస్తున్న యాష్ కాలుష్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడుగ్గా రోడ్లపైన, ఎక్కడపడితే అక్కడ ఫ్లైయాష్ డంప్ చేయకుండా చర్యలు చేపడతామన్నారు. వాటిపై ప్రత్యేక చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్టీపీపీ 600, ట్యాంకర్ల గేటు వద్ద రోడ్లపై ఆపుతున్న వాహనాలను ఆపకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 210 మెగావాట్ల సామర్థ్యం గల 5వ యూనిట్ 5వ తేదీ ఓవరాలింగ్ నిమిత్తం ఆపినట్లు తెలిపారు. 20రోజుల్లో పూర్తి చేసి మరో రెండు యూనిట్లను కూడా ఓవరాలింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. గురువారం వెయ్యి మెగావాట్లకు పైబడి ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ప్లాంటుల్లో సుమారు 2లక్షలకుపైబడి బొగ్గు నిల్వలున్నట్లు తెలిపారు. బొగ్గు సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నాం

● ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాషా



డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ విద్యారంగంలో అవలంభిస్తున్న ప్రయోగాత్మక విధానాలు, తిరోగమన చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్ బాషా, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లె అబ్దుల్లా తెలిపారు. గురువారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు కడప జిల్లా పరిపాలన అధికారి విజయ్ కుమార్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణలను ఫ్యాప్టో నేతలు కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాటట్లాడుతూ జూన్ నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్, జీఎస్టీ 2.0 పేరుతో మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయడం, విద్యాకానుకల పంపిణీ, రోజువారి నివేదికలను ఎంఈఓ కార్యాలయానికి పంపడం వంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులపై భారీ భారం మెపుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెస్‌మెంట్ పుస్తకాలు, టీచర్ హ్యాండ్‌బుక్ వంటి పనులతో బోధనకు ఆటంకం కలుగుతోందని, ఉపాధ్యాయులను తరగతి బోధన నుంచి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధన తప్ప ఇతర బోధనేతర కార్యక్రమాలను పూర్తిగా బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్ కిరణ్, జిల్లా నాయకులు మాదన విజయ్ కుమార్, ఖాదర్‌బాషా, శ్యామలాదేవి, సుబ్బారెడ్డి, జ్యోతి, రామచంద్రబాబు, జుబేర్ అహ్మద్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ... వృద్ధురాలికి గాయాలు

సీకేదిన్నె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులివెందుల రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వెంగమాంబ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. వేంపల్లె నుంచి కడపకు వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు పులివెందుల రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గురువారం మలుపు తీసుకుంటుండగా వెంగమాంబ అనే మహిళ వెనుకభాగంలో తగిలి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. వృద్ధురాలిని బస్సు డ్రైవర్ హుటాహుటిన ఆటోలో ఎక్కించుకుని చికిత్స అందించేందుకు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు?

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో దొంగతనం చేసి పారిపోయిన మాబాష, హసీనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకెళితే .... జనవరిలో అనంతపురం నుంచి వచ్చామని పార్నపల్లె గ్రామానికి చెందిన రాధ మహిళ ఇంట్లోకి అద్దెకు దిగారు. కొన్ని నెలలు ఆమెతో మంచిగా ఉంటూ నమ్మించారు. ఆగస్టు నెలలో రాధ తోట వద్దకు వెళ్లిన తర్వాత ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి రూ.1.10లక్షల నగదు, 9గ్రాముల బంగారం, వెండి పట్టీలు దొంగలించి పారిపోయారు. ఎట్టకేలకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.


జీఎస్టీ రేట్ల తగ్గింపుపై అవగాహన

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప ఐఎంఏ కార్యాలయంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి జీఎస్టీ రేట్ల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్నూల్ డ్రగ్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రవిబాబు స్టాల్‌ను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత నెల 22వ తేదీ నుంచి వినియోగదారునికి మేలు జరిగేలా జీఎస్టీలో భారీ మార్పులు చేసిందన్నారు. అందులో భాగంగా 12శాతం నుంచి 5శాతానికి తగ్గించిందన్నారు. అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

అరటి తోటను పరిశీలించిన జర్మన్ శాస్త్రవేత్తలు

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కులగారిపల్లెలో గురువారం జర్మనీ శాస్త్రవేత్తలు షర్వినాబుష్, జెరాల్డ్ రెహ్మాన్‌లు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న అరటితోటను పరిశీలించారు. గ్రామానికి చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా అరటి పంటను పండిస్తున్నారు. శాస్త్రవేత్తలు అరటి తోటను పరిశీలించి సాగులో యాజమాన్య పద్ధతులను, పంట దిగుబడిపై రైతును అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పార్నపల్లె విద్యార్థులు





లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండలంలోని పార్నపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ అండర్-19 విభాగంలో 10వ తరగతి చదువుతున్న నాగచైతన్య సాఫ్ట్‌బాల్ పోటీలకు, అండర్-17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న ప్రేమ్, హరి హరణ్ బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషిచేసిన పీడీ విక్టర్‌ను, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రతి ఖాతాదారునికి నాణ్యమైన సేవలు



మాట్లాడుతున్న ఏజీఎం రవికుమార్

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఖాతాదారునికి నాణ్యమైనసేవలు అందించాలని భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గెల్లా రవికుమార్ అన్నారు. గురువారం కడప సెవెన్‌రోడ్స్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారునికి అవసరమైన సేవలను అందించడం, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సరైన సమయంలో సేవలను అందిస్తున్న ఏకైక బ్యాంకు భారతీయ స్టేట్ బ్యాంక్ అని అన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తే ఓటీపీలను చెప్పకూడదని ఖాతాదారులకు సూచించారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై ఏమైన అనుమానాలు ఉంటే 1930కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. నకిలీ కాల్స్‌పట్ల పూర్తి అప్రమత్తతో ఉండాలన్నారు. ఏమైన ఖాతాలపై అనుమానాలు ఉంటే నేరుగా బ్యాంకు సిబ్బంది వద్దకు వచ్చి వారి నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. బ్యాంకు మేనేజర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ మోసపూరిత కాల్స్‌పై స్పందించరాదని తెలిపారు. లింకులపై ఎలాంటి క్లిక్కులు చేయకుండా జాగ్రత్త ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి, డిప్యూటీ మేనేజర్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 26.3 టీఎంసీల నీటిమట్టం



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో గురువారం 26.376 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమా మాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి వరదకాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

చీనీ తోటల్లో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



అంకాళమ్మగూడూరులో చీనీ రైతులకు సూచనలు ఇస్తున్న హెచ్‌ఓ మల్లేశ్వర్‌రెడ్డి

సింహాద్రిపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చీనీ తోటల్లో వర్షాకాలం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు మండల ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం మండలంలోని అంకాళమ్మగూడూరు, బలపనూరు, కోవరం గుట్టపల్లి గ్రామాల్లో హెచ్‌ఓ చీనీ తోటలను పరిశీలించారు. అనంతరం ఆయా రైతు సేవాకేంద్రాల్లో బంక తెగులు, వేరుకుళ్లు, పొలుసు పురుగు తెగుళ్ల నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో మండలం మొదటిస్థానంలో నిలవాలి



అవార్డులందుకున్న పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యదర్శులకు సంబంధించిన స్వచ్ఛాంధ్ర అవార్డులు అందుకోవడంలో చెన్నూరు మండలం రాష్ట్రస్థాయిలో మొదటిస్థానం సంపాదించాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. ఇటీవల సీఎం, కలెక్టరు చేతుల మీదుగా రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డు అందుకున్న చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, బయనపల్లె పంచాయతీ కార్యదర్శి రాజేశ్,ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పారిశుధ్య కార్మికులు హనుమంతు తదితరులను తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అలాగే పారిశుధ్య కార్మికులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలు ఆకస్మిక తనిఖీ

కడప క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం లాడ్జీలు ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితులను విచారించి ఆరా తీశారు. అంబేడ్కర్ సర్కిల్, వైజంక్షన్, అప్సర ప్రాంతాల్లో వాహనాలు, బస్సులను ఆపి తనిఖీ చేశారు. బస్టాండు ఆవరణంలో పార్శిల్‌కేంద్రంలో అణువణువూ తనిఖీ చేశారు. లాడ్జిల్లో పోలీసులు ప్రతి గదిని తనిఖీ చేసి అనుమానితులను ప్రశ్నించి వివరాలు పరిశీలించారు. లాడ్జిలోని రిజిస్టరున పరిశీలించారు. ఆకస్మిక తనిఖీల్లో సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ కార్మికులను తొలగించవద్దు

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లో కార్మికులను ఎవరినీ తొలగించవద్దని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు. గురువారం రిమ్స్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దరామయ్య, ఆర్‌సీపీ నాయకులు విజయ్‌కుమార్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

డేంజర్..!

- విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం



ఆయేషానగర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు

ప్రమాదం అంచున జీవనం సాగిస్తున్నా వారి ప్రాణాలకు నగరపాలక అధికారులు రక్షణ కల్పించలేకున్నారు. నగరంలోని మరాఠీ వీధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు మనిషికి అందేంత ఎత్తులో వేలాడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీనికి తోడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా రోడ్డుపక్కనే ఉండడంతో స్థానికులు భయాందోళనలో ఉన్నారు. చిన్నారులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. నగరపాలక అధికారులు, విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి తీగలను సరి చేసి స్థానికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



మరాఠీవీధిలో చుట్టూ కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రవీంద్రనగర్‌లో కింద ఉన్న విద్యుత్ తీగలు

ఆలయ నిర్మాణం శుభదాయకం

ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రామాలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించడం శుభదాయకమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కాగా ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, సర్పంచ్ సుదర్శనరెడ్డి, మాజీ సర్పంచ్ ఆదిమూలం శివయ్యయాదవ్, రామసుబ్బారెడ్డి, ఆర్.సుబ్బారెడ్డి, పర్వతరెడ్డి, చిన్నకొండారెడ్డి, లేబాకు సుబ్బారెడ్డి, పుల్లయ్యయాదవ్,ఇందిరెడ్డి శివారెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీకరరెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పాలగిరి పెద్దసుబ్బారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్న నిమ్మ రైతులను ఆదుకోవాలి

చక్రాయపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సన్న నిమ్మకాయల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెలో సన్న నిమ్మకాయల మండీని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీం ద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు.

వైసీపీ కుయుక్తులు చిత్తయ్యేలా కూటమి పాలన

కడప మారుతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగుతున్న కూటమి సర్కార్ సుపరిపాలనను చూసి ఓర్వలేకనే కొంతమంది వైసీపీనేతలు రాష్ట్రంలో అలజడి రేకెత్తేలా కుయుక్తులకు తెగబడుతున్నారని, అలాంటివారి ఎత్తులు చిత్తయ్యేలా కూటమి సర్కార్ పాలన చేస్తోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఇటీవల చిత్తూరు జిల్లా దేవళంపేట బస్టాండ్ సమీపంలో ఆంబేడ్కర్ విగ్రహానికి ఆ ప్రాంత వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయితీ సర్పంచ్, వైసీపీ నాయకుడు గోవిందయ్య తన అనుచరులతో నిప్పుపెట్టించేలా కుట్రకు తెరతీయడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మన్సూర్ అలీఖాన్, చవలముడి శంకర్, జిలానీబాషా, సుబ్బారెడ్డి, సిలాస్, శివారెడ్డి, సుబ్బరాయుడు, అఫ్జల్, జి.వి. రమణ, తుంగా రమణయ్య, మాట్లాడారు. కాగా నిరసన అనంతరం అంబేడ్కర్ విగ్రహ పాదాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జయకుమార్, మనోజ్ కుమార్, చిన్నబాబు, జె.కె. ఖాదర్‌బాష, చిట్టిబోయిన చిన్నసుబ్బరాయుడు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కూటమి నాయకులు

'సీబీఐ విచారణ జరిపించాలి'

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అంతటా నకిలీ మద్యం ఏరులై పారుతోందని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్ బాష తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కల్తీ మద్యం తయారీ, పంపిణీపైసీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేవారు. గురువారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కల్తీ మద్యం కుటీర పరిశ్రమలా నడిపిస్తోందని ఆరోపించారు. ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహమ్మద్ షఫి, బసవరాజు,కె.బాబు, చాక్లెట్ గౌస్, అజ్మతుల్లా, జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్యయాదవ్, మునిశేఖర్‌రెడ్డి, మాస్టర్ అహ్మద్ పాల్గొన్నారు.

కులగణన చేపట్టిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటు కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలోమైదుకూరు నియోజకవర్గ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, కె.నాగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జి.వెంకటరమణ, మధు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆనందానికి క్రీడలు తప్పనిసరి

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో సునీత అన్నారు. మండలంలోని కొండపేట ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమండల కోఆర్డినేటర్లుగా రామనపల్లె, కొండపేట, చిన్నమాచుపల్లె చెన్నూరు బాలికల, బాలుర ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు గణేశ్‌బాబు,విద్యాసాగర్, ప్రతాప్‌రెడ్డి సుబ్బమ్మ, రాజగోపాల్‌రెడ్డి నిర్వాహకులుగా ఉండగా,పర్యవేక్షకులుగా కొండపేట ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రామనపల్లె హెచ్ఎం ఉమామహేశ్వరి వ్యవహరించారు.

విచ్చలవిడిగా అవినీతి : పెద్దిరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా ఇన్‌చార్జి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి విమర్శించారు. గురువారం కడప నగరం వైసీపీ నూతన జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు, గిట్టుబాటు ధరలు కోసం ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు అజయ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, బద్వేల్ ఎమ్మెల్యే సుధ, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి,రమేష్‌యాదవ్, రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ పరిశీలకుడు సురేష్‌బాబు, రాష్ట్రసంయుక్త కార్యదర్శి పాకా సురేష్, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు,ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు సీజే గవాయ్‌పై దాడి పాశవికం

కడప కలెక్టరేట్,అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై దాడిచేసిన మతోన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలుఎన్.డి.విజయజ్యోతి డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్, సిరాజుద్దీన్,మైనుద్దీన్ పాల్గొన్నారు.

లింగాల ఎస్‌ఐగా అనిల్‌కుమార్

లింగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): లింగాల ఎస్‌ఐగా అనిల్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. పులివెందులలో ట్రైనీ ఎస్‌ఐగా శిక్షణ పూర్తిచేసుకున్న ఆయనను లింగాల ప్రొబేషన్ ఎస్‌ఐగా నియమిస్తూ ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలు జారీ చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడేందుకు కృషిచేస్తానని తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు

పెండ్లిమర్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప ఆపరేషన్ డివిజన్‌లోని పెండ్లిమర్రి సెక్షన్ పరిధిలో ఉన్న వైవీయూ ఉప విద్యుత్ కేంద్రంలో ఉన్న 11 కేవీ దిగువపల్లె ఫీడర్ క్రింద వచ్చే రైతులకు వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు చేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.శుక్రవారం నుంచి 9 గంటల వ్యవసాయ కరెంట్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. రైతులందరూ గమనించాలని ఏఈ తెలిపారు.

దృష్టిలోపం రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

పులివెందుల రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దృష్టిలోపం రాకుండా ఆకుకూరలు, గుడ్లు, చేపలు లాంటి పౌష్టికాహారం తీసుకోవాలని నగరిగుట్ట యూపీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష విద్యార్థినులకు సూచించారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్,స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనిత, శ్రీనివాసులు, సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆన్‌కాల్ డ్రైవర్లను తొలగించండి'

కడప మారుతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం రాష్ట్రంలో అమలు అయిన తర్వాతా డ్రైవర్ల కొరత పేరుతో ఇటీవల ఆర్టీసీలో తీసుకున్న ఆన్‌కాల్ డ్రైవర్లను వెంటనే తొలగించాలని ఆర్టీసీ ఎన్ఎంయూ రీజనల్ అధ్యక్షుడు ఎస్.నాగముని, కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ బస్టాండు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు టిప్ బాషా, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యదశ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదికరాష్ట్ర మ్యాజిక్ కార్యదర్శి బాలబయన్న, ప్రతినిధి వెంకటేశ్ అన్నారు. గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 4,7 ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలంలోని ఇసుకపల్లె, మిట్టమీదపల్లెలో ప్రత్యేక శిబిరాలు రెండో రోజు కొనసాగాయి. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జన విజ్ఞానవేదిక రాష్ట్ర మ్యాజిక్ కార్యదర్శి బాలబయన్న, ప్రతినిధి వెంకటేశ్ ప్రదర్శించిన ఇంద్రజాలం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.లలిత, డాక్టర్ సునీత, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టాపింగ్ ఏర్పాటు చేయాలి

పెండ్లిమర్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో చెర్లోపల్లె వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలను ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి అనువుగా ఉండేందుకు వీలుగా ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టాపింగ్ ఏర్పాటు చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి ఆర్టీసీ అధికారులను కోరారు.బస్సు సౌకర్యం ఉంటే వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.ఇప్పటికే కడప ఆర్టీసీ డీఎంను కలసి వినతి పత్రం ఇచ్చామన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెండ్లిమర్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ రవిబాబు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు.అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్,సూపర్ వైజర్స్ కేశవ,యల్లమ్మ,సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య రంగంలో తగ్గిన జీఎస్టీపై అవగాహన

పులివెందుల రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 మార్పులో భాగంగా వైద్యరంగంలో పరికరాలు, మందులు, ఆరోగ్య బీమా తదితర వాటిపై తగ్గిన పన్ను శాతంపై అవగాహన కల్పిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్ అన్నారు. గురువారం పట్టణంలోని నగరిగుట్ట యూపీహెచ్‌సీతో పాటు అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహ ప్రత్యూష, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేముల..: జీఎస్టీ 2.0తో ఆరోగ్య రంగంలో మంచి మార్పులు వచ్చాయని డాక్టర్ మేఘన పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన వేముల పీహెచ్‌సీలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దృష్టి దినోత్సవం

కడప నాగరాజుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని కంటి వైద్య విభాగంలో ప్రపంచ దృష్టి దినోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞాన ప్రసూన, వైద్య విద్యార్థులు, వైద్యసిబ్బంది నుద్దేశించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ మాధవీలత, డాక్టర్ అస్మా, మోనికా, భారతి, సోఫియా, సుస్మిత, రూప, ఆస్ట్రామిక్ అధికారి కంభం చిన్నయ్య, సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యకలాపాలను బహిష్కరిస్తున్నాం

పెండ్లిమర్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు పాఠశాలల్లో బోధనేతర కార్యకలాపాల ను,విద్యాశక్తి కార్యక్రమాలను నేటి నుంచి బహిష్కరిస్తు న్నామని సమాఖ్య మండల అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు.మండల కేంద్రం లోని ఎమ్మార్సీలో గురువారం ఎంఈవో సుజాతకు ఉపాధ్యాయులతో కలసి వినతి పత్రం అందచేశారు.

వీరపునాయునిపల్లె..: పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిస్తున్నట్లు ఎస్టీయు రాష్ట్ర కమిటీ కన్వీనర్ శంకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు వీరపునాయునిపల్లె మండల విద్యాశాఖ అధికారి అనితను కలిసి వారు మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రతినిధులుపాల్గొన్నారు.

ఓటు హక్కును కాపాడుకుందాం

కడప కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో అవకతవకలు జరగకుండా మన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన దుస్థితి నెలకొందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. గురువారం నగరకాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుసయ్యద్ గౌస్‌పీర్,36 వ డివిజన్ ఇంచార్జి దాసరి శ్రీనివాసుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



36వ డివిజన్‌లో సంతకాల సేకరణలో జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి

పోటీ మార్కెట్‌తో నష్టాలు

● అనుమతులు ఎలా ఇచ్చారంటున్న కూరగాయల విక్రయదారులు ● పన్నులు చెల్లిస్తూ నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆందోళన



వేలం ద్వారా నడుస్తున్న కూరగాయల మార్కెట్



రైతుల పేరుతో అనధికారికంగా నడుస్తున్న మార్కెట్

బద్వేలు రూరల్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా కూరగాయల మార్కెట్ ఎక్కడైనా ఒకటే ఉంటుంది. రెండో మార్కెట్ ఉందంటే అది రైతుబజారు మాత్రమే అయి ఉండాలి. బద్వేలు మున్సిపల్ పరిధిలో అధికారికంగా కూరగాయల మార్కెట్ ఉండగా అనధికారికంగా మరో మార్కెట్ నడుస్తోంది. దీంతో ఏడాదికి లక్షలు పన్నులు చెల్లిస్తున్నా తాము రెండో మార్కెట్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బద్వేలు కూరగాయల మార్కెట్ స్థలంలో దాదాపు కొన్నేళ్లుగా కూరగాయల వ్యాపారులతోపాటు రైతులు కూడా వారు పండించిన కూరగాయాలను తెచ్చుకుని వ్యాపారాలు సాగిస్తుండేవారు. కాగా మార్కెట్ ఉన్న స్థలంలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుండడంతో మైదుకూరు రోడ్డులోని గుంతపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణలో కూరగాయలు విక్రయించుకునేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొందరు దళారీలు రంగప్రవేశం చేసి రైతల వద్ద నుంచి కూరగాయలు కొనుగోలు చేసి అక్కడే మరో కూరగాయల మార్కెట్ నడుపుతున్నారు. దీంతో కూరగాయల మార్కెట్ వ్యాపారులు తాము మున్సిపాలిటీకి రుసుం చెల్లిస్తూ వ్యాపారాలు సాగిస్తుంటే ఎలాంటి రుసుం చెల్లించని దళారీలు మరో కూరగాయల మార్కెట్ నడపడం ఏమిటంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఊసే లేని రైతు మార్కెట్

బద్వేలు పరిసర ప్రాంత గ్రామ రైతులు తాము పండించిన కూరగాయలను బద్వేలు పట్టణానికి తీసుకువచ్చి విక్రయించేందుకు ఎన్నో ఏళ్లగా రైతు మార్కెట్ లేదని వాపోతున్నారు. పలుమార్లు రైతుమార్కెట్ కోసం విజ్ఞప్తిచేసినా ఎవ్వరూ పట్టించుకోవడంలేదంటున్నారు.. దీంతో రైతులు పట్టణానికి వచ్చినప్పటికీ తాము పండించిన కాయగూరలను ఎవరికో ఒకరికి విక్రయించి వచ్చిన కాడికి డబ్బులు తీసుకుని వెళుతున్నామన్నారు. అదే రైతు మార్కెట్ ఉంటే తమకు కష్టాలు ఉండవని వారంటున్నారు.

రైతులే విక్రయాలు జరుపుకోవాలి

రైతులు వారు పండించిన కూరగాయలను వారే అమ్ముకునేందుకు మైదుకూరు రోడులో ఏర్పాటు చేసిన ప్రాంతంలో క్రయ విక్రయాలు సాగించాలని మున్సిపల్ కమిషనరు వాకమల్ల నరసింహారెడ్డి సూచించారు. ఆ ప్రాంతంలో ఓ బోర్డు కూడా ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు.

దళారీ వ్యవస్థను అరి కట్టాలి



పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ ఏడాదికి ఒకసారి నిర్వహిస్తున్న వేలం పాటలో లక్షలను వెచ్చించి సొంతం చేసుకుంటున్నాం. ఈ ఏడాది రూ. 22లక్షలు వేలం పాటపాడి మార్కెట్ దక్కించుకున్నాం. అయితే దళారీలు మరో మార్కెట్‌ను నడుపుతుండడంతో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన కూరగాలయల మార్కెట్‌లో వ్యాపారాలు సాగడంలేదు. రుసుం చెల్లించాల్సిన వ్యాపారులు కూడా రుసుం చెల్లిం చలేని పరిస్థితిలో ఉన్నారు. మున్సి పల్ అధికాఋలు దళారీ వ్యవస్థను అరికట్టి కూరగాయల వ్యాపారులకు న్యాయం చేయాలి,

- ధర్మిశెట్టి శ్రీనివాసకుమార్ (అశోక్),
కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, బద్వేలు

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిది



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి

కాశినాయన అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) వ్యాధులతో ఇబ్బందులు పడుతూ చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి కె.రితేష్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఉప్పలూరుకు చెందిన చాకలి రమాదేవికి బద్వేల్ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డితో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో రంపాడు మాజీ ఎంపీటీసీ టీడీపీ నాయకుడు పి.పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కొరడా

బద్వేలు, అక్టోబర్9 (ఆంధ్రజ్యోతి) : భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని తిప్పనపల్లె గ్రామ పొలాలలో రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్ ద్వారా ప్రభుత్వ భూమిని చదును చేసి కొంతమంది ఆక్రమించుకుని ప్రభుత్వ స్థలం చుట్టూ పోల్స్ ఏర్పాటు చేశారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు గురువారం తహశీలార్ ఉదయభాస్కర్, సంబంధిత పోల్స్‌ను తొలగించి ఆక్రమణకు గురైన 413,414ఎ, 412 తదితర భూములలో ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు. ఆక్రమిత గురైన భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

విగ్రహానికి నిప్పుపెట్టినవారిపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వైసీపీ సర్పంచ్ గోవిందయ్యను తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బిర్రు సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ దళితులను అవమానించే రీతిగా వైసీపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విచారణ చేసి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి దారుణం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

కొండాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రామకృష్ణ గవాయ్‌పై దాడి దారుణమని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డుపై గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాకేష్ కిషోర్ అనే న్యాయవాది, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై కోర్టులోనే దాడిచేయడం దురదృష్టకరమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు, ప్రసాదు, ఖాదర్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఉద్యమం

ఎర్రగుంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించకపోతే దీపావళి తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఫ్యాప్టో హెచ్చరించింది. ఆమేరకు గురువారం ఎర్రగుంట్లలో ఎంఈవోకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈసందర్భంగా ఫ్యాప్టోనాయకులు జి.రంగయ్య, పి.ఓబులేసు,ఎం.ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ నేటి నుంచి బోధనేతర కార్యక్రమాలన్నింటిని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, మండల ఫ్యాప్టో నాయకులుషేక్షావలి, శివరామిరెడ్డి, చక్రపాణి పాల్గొన్నారు.

చాపాడులో: పాఠశాలలో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజారెడ్డి, మల్లికార్జున, సుబ్బరాయుడు, బాస్కర్, క్రిష్టయ్య చెప్పారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు అదనపు పనులు చేయమని చెప్పడంతో విద్యార్థులకు విద్యాబోధన కుంటుపడుతున్నదని చెప్పారు. ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణలకు వారు గురువారం ఒక వినతి పత్రం అందజేశారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: మితిమీరిన బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తామని ఫ్యాప్టో నాయకులు గురువారం ఎంఈవో సావిత్రమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు పరీక్షా పత్రం మూల్యాంకనం మినహా ఇతర బోధనేతర కార్యక్రమాలు నిర్వహించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కొత్తపల్లె శ్రీను, జిల్లా కోఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, సుబ్రమణ్యం, సలీం, సుబ్బారెడ్డి, సయ్యద్‌బాష, రమణ, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

కాశినాయన అక్టోబరు9(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని ఏపీ ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నర్సాపురంలోని ఏపీ మోడల్ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీషు బోధన సరళతరం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఒకే సారి 164 పాఠశాలలను ప్రారంభించినా ఇప్పటివరకు సర్వీస్ రూల్స్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో పనిచేస్తూ చనిపోయిన 18 మంది ఉపాధ్యాయుల కుటుంబాలలో ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టి వారిని ఆదుకోవాలని కోరారు.

విద్యార్థుల ఆటలపోటీలు

చాపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని జీపీఎస్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి విద్యార్థులకు మండలస్థాయి ఆటలపోటీలు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు పీఈటీలు ఓబయ్య, శివారెడ్డి పేర్కొన్నారు.

36 రకాల మందులపై జీఎస్టీ మినహాయింపు

ప్రొద్దుటూరు అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన 36 రకాల వ్యాధుల మందులపై కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ మినహాయించిందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత తెలిపారు. గురువారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగింది. జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ హాలు నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది అధికారులు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ ప్రజలకు తక్కువ జీఎస్టీతో లభించే ఆరోగ్య ఉత్పత్తులు, మందులు, పరికరాలు, ఆరోగ్య జీవిత బీమాపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ర్యాలీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వినోద్ కుమార్, కార్యదర్శి డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, జీఎస్టీ నోడల్ అధికారి రాజసింహారెడ్డి, హెల్త్ ఇన్సూరెన్సు మేనేజర్ శంకరయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సూపర్‌వైజర్లు ఏఎన్‌ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గురువారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పట్టణంలోని పురవీధుల్లో డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాన్సర్ మందులకు జీరోశాతం జీఎస్టీ ఉందని వివరించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, జీఎస్టీ డిపార్టుమెంట్, ఆస్పత్రి సిబ్బంది, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీవో శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈవో రామమోహన్, ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది

మైదుకూరులో: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం మైదుకూరు పట్టణంలో సూపర్ జీఎస్‌టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విభాగంలో అన్ని రకాల వస్తువులపై, ప్రాణాంతక వ్యాధుల మందులపై జీఎస్‌టీ పూర్తిగా తీసివేశారని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వి. మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలొ మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ ఏపీ రవీంద్ర, మెడికల్ ఆఫీసర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ లో పాల్గొన్న ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

మరింత చేరువలో పేదలకు వైద్యసేవలు

ప్రొద్దుటూరురూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, జీవన విధానాన్ని మెరుగుపరచుకునేందుకు సులభతరం అయిందని కామనూరు పీహెచ్‌సీ జీఎస్టీ చాంపియన్ బీఏ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలోని 16 సచివాలయాల పరిధిలోని కార్యదర్శులతో కలిసి జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు షేక్ సమీన్, మోసే, లక్ష్మీ సునీత, సచివాలయ చాంపియన్స్, కార్యదర్శులు రామాంజనేయులరెడ్డి, రామకృష్ణ, సుహాసిని, డిజిటల్ అసిస్టెంట్లు, సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చంద్రకళ, ఆప్తాల్మిక్ అధికారి తేజ, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు, పరికరాలు కొనుగోలు చేసేవారికి జీఎస్టీ తక్కువ చేయడంతో రేట్లు తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరులో గురువారం ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ జరిగింది. సూపర్ జీఎస్టీ వలన ప్రాణ రక్షణ మందులు, ల్యాబ్ పరికరాలపై అయిదు నుంచి 12 శాతం జీఎస్టీ తగ్గుతుందని ర్యాలీ ద్వారా తెలియజేశారు. ర్యాలీలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, స్థానిక వైద్యులు, వారి సిబ్బంది, మెడికల్ స్టోర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దౌర్జన్యానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

దువ్వూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే నిమిత్తం దౌర్జన్యానికి పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి వివకుమార్ కోరారు. ఈ స్థల విషయమై గ్రామంలో పరస్పర దాడులు జరుగకుండా పోటీలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు సంజీవరెడ్డికి, పోలీసులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని వికాస్ విహార్ మానసిక పాఠశాలలో చిన్నారులకు పశువైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు క్రీడాసామగ్రిని అందజేశారు. గురువారం శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు మానసిక వికలాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

స్త్రీశక్తికి అదనంగా బస్సులు ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ నేతలు

జమ్మలమడుగు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకానికి జమ్మలమడుగు నుంచి అన్ని రూట్లలో అదనంగా బస్సులు ఏర్పాటు చేయాలని ప్రస్తుతం కొన్ని రూట్లలో ఇబ్బందులు ఉన్నాయని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ఎంజీసీవో రెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గేటు వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప రీజినల్ కమిటీ పిలుపు మేరకు గేటు వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రీజినల్ ఛైర్మన్ శేషన్న మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌కు వ్యతిరేకంగా దూర ప్రాంతాలకు ఆన్‌కాల్ డ్రైవర్స్‌ను పంపించకూడదని, మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పులివెందుల, జమ్మలమడుగు ఏరియాల్లో పల్లె వెలుగు వన్‌మెన్ సర్వీసులను కండక్టర్ సర్వీసులుగా మార్చాలని, కండక్టర్లు టిక్కెట్లను ఇచ్చే టిమ్ మిషన్ చార్జింగ్ ఉండడం లేదని వాటి స్థానంలో కొత్త వాటిని ఇవ్వాలన్నారు. గ్యారేజీ ఉద్యోగులకు ఇచ్చిన చార్జిషీట్లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అడిషనల్ కార్యదర్శి కాంతయ్య, రీజినల్ కమిటీ మెంబర్ మోహన్‌రెడ్డి, పీఎస్ వాసులు, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎంవలి, అధ్యక్షుడు బ్రహ్మయ్య, రామచంద్రుడు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మైదుకూరు అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని ఎన్‌ఎంయూఏ నేతలు డిమాం డ్ చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మైదుకూరు ఆర్‌టీసీ డిపో వద్ద ఎన్ ఎంయూఏ నాయకులు గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ జిల్లా ప్రజా రవాణాధికారి(డీపీటీఓ),డిపో మేనేజర్లు ఉద్యోగుల పట్ల తమ వైఖరి మార్చుకోవాలని, ఆన్‌కాల్ డ్రైవర్లను తొలగించాలని, అక్ర మ చార్జ్‌షీట్లను రద్దు చేయాలని, స్త్రీశక్తి పథకం అమలు ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించి,రద్దీ పెరిగిన రూట్లలో అదనపు బస్సులను నడపాలని కోరారు.ఈ కార్యక్ర మంలో డిపో సెక్రటరీ వీఎస్ రాయుడు, గ్యారేజి కార్యదర్శి వైఎస్ రాయుడు,ట్రెజరర్ ఎన్ఎస్ రాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



పోరుమామిళ్లలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

పోరుమామిళ్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగం గా డ్రైనేజీ కాల్వలు. ప్లాట్‌పాం నిర్మాణాలకు సంబంధించిన స్థలాన్ని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ గురువారం పరిశీలించారు. తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ సలీం, సర్వేయరు సందీప్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి వైజంక్షన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్డుకు కుడివైపు ఉన్న షాపులన్నింటినీ ఆర్డీవో పరిశీలించి రోడ్డు నిర్మాణా నికి సహకరించాలని సూచించారు. ప్రైవేటు స్థలం ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకు రాగా ప్రభుత్వం స్థలం వరకు నిర్మాణం జరుగుతుందని ప్రైవేటుది అయితే వాటికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులకు నష్టపరిహారం అందేలా చూడాలి

జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందేలా చూడాలని చెన్నారెడ్డిపేటకు చెందిన రైతులు గురువారం బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ ఎదుట వాపోయారు. కొందరి బావులు పోకున్నా పోయినట్లు నమోదు చేయించుకుని నష్టపరిహారం పొందారన్నారు. కావున తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా, వారు రికార్డులు అన్నీ సమర్పిస్తే నష్టపరిహారం అందేలా చూస్తామని ఆర్డీవో చెప్పారన్నారు.

అన్నా క్యాంటీన్‌లో వసతులు కరువు

● నేలపై కూర్చొని తింటున్న ప్రజలు ● పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అన్నాక్యాంటీన్ లో అరుగులేక నేలపై కూర్చొని అన్నంతింటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అన్నాక్యాంటిన్లలో సరైన సదుపాయాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేలపై కూర్చొని భోజనం తింటున్నారు. అన్నాక్యాంటీన్ ఆవరణలో పచ్చని చెట్లు వున్నా కూర్చొని తినడానికి కనీసం బెంచీలు లేవన్నారు. ఆవరణలో రేకుల షెడ్డు, బెంచీలు వేస్తే ఇబ్బందులు లేకుండా భోజనం చేయవ చ్చన్నారు. షెడ్డుతో పాటు ప్రహరీ చుట్టూ బెంచీలు వేస్తే వృద్ధులు, దివ్యాంగులైన వా రు నేలమీద కూర్చొలేని వారు బెంచీల మీద కూర్చుంటారు. కొందరు టీడీపీ కౌన్సిల్లర్లు అన్నాక్యాంటీన్‌లో బెంచీలైనా, బండరాయి అరుగులు అయినా వేయాలని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా నేటికి పట్టించుకోలేదని చెబుతున్నారు. కనీసం ఎవరైనా దాతలను సంప్రదించినా మంచి బెంచీలు, బండరాయి అరుగులు వేయడానికి సిద్ధపడ తారని చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. అన్నాక్యాంటీన్‌లో వసతుల ఏర్పాటుపై మున్సిపల్ ఈఈ శ్రీనివాసులును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా క్యాంటీన్ ఆవరణలో రేకుల షెడ్డుతో పాటు బెంచీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా సూచించారు. ఇందు కోసం రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనాలు వేశామన్నారు. కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం తీసుకొని టెండర్లకు పిలుస్తామన్నారు.

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుజాత



ప్రొద్దుటూరు , అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుజాత నియమితులయ్యారు. ఆమె రెండె నెలల క్రితం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి బదిలీపై ప్రొద్దుటూరు ఆసుపత్రికి వచ్చారు. గైనకాలజిస్టుగా విధు లు నిర్వహిస్తున్నారు. సీనియారిటీలో భాగంగా ఆమె సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ రూపానంద్ డాక్టర్ సుజాతకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సుజాత మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలుఅందేలా కృషి చేస్తానని తెలిపారు.

బాలాజీ నగర్‌లో కలుషిత నీటికి చెక్

ప్రొద్దుటూరు , అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 2 వవార్డు పరిధిలోని జమ్మలమడుగు రోడ్డు బాలాజీనగర్‌లో గత కొన్ని రోజులుగా మున్సిపల్ కొళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో లీకేజీ ఎక్కడ అవుతుందో తెలసుకోవడానికి కొద్దిరోజులు సమయం పట్టింది. ఎట్టకేలకు మురుగు కాలువలో పైపులైను లీక్ అయి మురుగునీరు కొళాయిలకు వస్తుందని గుర్తించి గురువారం మున్సిపల్ వాటర్ వర్క్స్ ఏఈ సురేంద్ర ఆదేశాలమేరకు వాటర్‌వర్క్స్ సిబ్బంది పైప్‌లైన్ లీకేజీ పనులు చేపట్టారు. శుక్రవారం నుంచి పైప్‌లైన్ ద్వారా మంచి నీరు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి : డీఎం

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం హైర్‌బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్లపై దాడులు జరుగకుండా చూస్తామని, డ్రైవర్లపై దాడులకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

బహిరంగ సభ ఏర్పాట్లలో భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కర్నూలులో భారీ బహిరంగ సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 16వ తేదీన కర్నూలులో భారీ బహిరంగ సభ జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఏపీపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాటనీ పోస్టుకు దరఖాస్తు

ఎర్రగుంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల బాటనీ బోధించడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ త్రివిక్రం రెడ్డి తెలిపారు. అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులతో బాటనీలో ఎంఎస్సీ పట్టభద్రులుగా ఉండాలన్నారు. ఎంపిక త్రిసభ్య కమిటీ ద్వారా జరుగుతుందన్నారు. అర్హత ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులు అక్టోబరు 14నాటికి చేరాలన్నారు.